ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -61 పేజీలు - 8 వెల - 03/- శనివారం 20 జూన్ 2026

## ట్రంప్ మాట బేఖాతరు..
# లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

**వైమానిక దాడుల్లో దాదాపు 16 మంది మృతి**

**ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం**

**ఒప్పందం ప్రకారం లెబనాన్‌పైనా సైనిక చర్యలు ఆపాలి**

**అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేసిన నెతన్యాహు**

**తాజా ఘర్షణలతో శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం**



**జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**
ఇరాన్–అమెరికా మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన గంటల్లోనే మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు అక్కడి ప్రభుత్వ వార్తా **మిగతా 2లో...**

# నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

**రూ.3,125 కోట్లు పంపిణీకి రంగం సిద్ధం**

**46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ది**

**లింగంగుట్లలో అందచేయనున్న సిఎం చంద్రబాబు**



**అమరావతి,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులను ఏపి ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగం గుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నగదును అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.3,125 కోట్లు **మిగతా 2లో...**



## ఏపీ పారిశ్రామికాభివృద్ధికి
# సహకరించండి..

**పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ పిలుపు**

**కోల్‌కతాలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో మంత్రి నారా లోకేశ్ భేటీ**

**ఏపీలో పెట్టుబడులకు ఉన్న సానుకూల అంశాలను వివరించిన లోకేశ్**

**కోల్‌కతాజూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక, తయారీ రంగ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఇందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఆయన కోల్‌కతాలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో**మిగతా 2లో...**

# సిఎం భరోసా

## సిఎం చంద్రబాబుతో సాయికృష్ణ తల్లి భేటీ



**కుటుంబసభ్యులతో కలసి వెళ్లిన విజయలక్ష్మి**

**సాయికృష్ణ అదృశ్యంపై విచార జరుగుతోందన్న సిఎం**

**ఎంతటి వారినైనా వదలబోమని చంద్రబాబు హామీ**

**కుటుంబానికి అండబగా ఉంటామని భరోసా**

**అమరావతి,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**
విజయవాడలోని కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సాయికృష్ణ కుటుంబసభ్యులు శుక్రవారం కలిశారు. సాయికృష్ణ తల్లితో పాటు ఇతర కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబును సాయికృష్ణ కుటుంబసభ్యులు కలిశారు. తమకు న్యాయం చేయాలంటూ సాయికృష్ణ తల్లి కోరారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. సాయికృష్ణ అదృశ్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి, దర్యాప్తును వేగవంతం చేశామని వెల్లడించారు. తప్పు చేసినవారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని సాయికృష్ణ తల్లికి **మిగతా 2లో...**

## వార్షిక రుణ ప్రణాళిక
# రూ.8.10 లక్షల కోట్లు

**బ్యాంకర్ల కమిటీ సమావేశంలో రుణాలపై చర్చ**

**రూ.3,86,249కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడి**

**సిఎం చంద్రబాబు అధ్యక్షతన బ్యాంకర్ల కమిటీ భేటీ**




**అమరావతి,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. ఏపీ సచివాలయంలోని 5వ బ్లాక్‌లో శుక్రవారం మధ్యాహ్నం 235వ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో 2026–27 వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో సీఎం చంద్రబాబు చర్చించారు. వ్యవసాయ రంగం, ఎంఎస్‌ఎంఈలు, స్వయం సహాయ సంఘాలు, కౌలు రైతులకు అందించిన రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.3,86,249కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బ్యాంకర్లు వివరించారు. ఎంఎస్‌ఎంఈ రంగానికి రూ.1,17,357కోట్లు, ప్రాధాన్య రంగానికి రూ.5,19,693కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రుణాల పంపిణీ 137 శాతం మేర ఉన్నట్లు సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకర్లకు**మిగతా 2లో...**

## ఏపీలో రెండు
# విషాదాంతాలు..

**కుటుంబ కలహాలతో ఏడుగురి మృతి**




**ప్రకాశం జిల్లాలో ముగ్గురు కూతుళ్లకు విషమిచ్చి చంపి, తండ్రి ఆత్మహత్య**

**శ్రీకాకుళంలో ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి తల్లి బలవన్మరణం**



## మూసీ రివర్ ఫ్రంట్ కు
# కేంద్రం అనుమతి..

**ధన్యవాదాలు తెలిపిన రేవంత్ రెడ్డి**

**రక్షణ శాఖ భూములు వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతి**

**83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగించుకోవడానికి క్లియరెన్స్ ఇచ్చిన కేంద్రం**

**హైదరాబాద్,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్)::**
తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుగా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే రక్షణ శాఖ భూములను వినియోగించుకునేందుకు వీలుగా కేంద్రం పని అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.**మిగతా 2లో...**

# హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం

**మణికొండ మల్కం చెరువు సమీపంలో కొత్త ఆఫీస్**

**జెండా ఎగురేసి ప్రారంభించిన జనసేనాని పవన్ కళ్యాణ్**



**హైదరాబాద్,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):** హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం÷– పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు**మిగతా 2లో...**

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

**మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి**

**కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు**

**మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు**



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:2023/87888



# మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి..

**మొదటిపేజీ తరువాయి**

ఈ అనుమతుల ప్రకారం... ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని సుమారు రూ. 533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల రక్షణ శాఖ భూమిని గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకోవడానికి కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. లీగల్, డిఫెన్స్ నిబంధనల ప్రకారం ఇరు ప్రభుత్వాల మధ్య జరిగిన సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం ఈ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియకు కేంద్ర రక్షణ శాఖ తుది ఆమోదం తెలిపింది. దీంతో బాపూఘాట్ పరిసరాల్లో ప్రతిపాదిత అంతర్జాతీయ స్థాయి స్మారక చిహ్నాలు, పర్యాటక హంగుల నిర్మాణానికి ఉన్న ప్రధాన లీగల్ అడ్డంకులు తొలగిపోయాయి.
మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు లభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. "మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించి మా ప్రభుత్వం పెట్టుకున్న సుదూర లక్ష్యాలు సాధించడంలో ఇదో చారిత్రాత్మక మైలురాయి. మూసీ పరివాహక ప్రాంతాన్ని కేవలం కాంక్రీట్ కట్టడాలుగా కాకుండా.. పర్యావరణ, సాంస్కృతిక, అద్భుతమైన ప్రజా ఆస్తిగా మార్చడమే మా ప్రభుత్వ ప్రధాన సంకల్పం" అని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం ఇచ్చిన క్లియరెన్స్‌తో మూసీ ఫేజ్-1 పనులు మరింత వేగవంతం కానున్నాయి.

# ట్రంప్ మాట బేఖాతరు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

**మొదటిపేజీ తరువాయి**

సంస్థ వెల్లడించింది. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఆందోళనకరంగా మారింది. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై గురువారం రాత్రి నుంచి దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఆ ప్రాంతంలో తీవ్ర ఘర్షణ జరుగుతోందని తెలిపింది. ఈ పరిణామం ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన తాజా ఒప్పందానికి సవాల్‌గా మారింది. ఆ ఒప్పందం ప్రకారం లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాల్లో సైనిక చర్యలు వెంటనే నిలిపివేయాలి. అలాగే లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సి ఉంటుంది. అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం వెనక్కి తగ్గేది లేదనే సంకేతాలు ఇచ్చారు. హెజ్బొల్లా నుంచి ముప్పు పూర్తిగా తొలగే వరకు లెబనాన్‌లో సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్-అమెరికా ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు కూడా వాయిదా పడ్డాయి. శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ. వాన్స్.. స్విట్జర్లాండ్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అధికారికంగా సాంకేతిక కారణాలే కారణమని వైట్‌హౌస్ తెలిపింది. కానీ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో ఇరాన్ తన ప్రతినిధి బృందాన్ని పంపడంలో జాప్యం చేస్తోందన్న వార్తలు వెలువడ్డాయి. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న ఆశలు వ్యక్తమయ్యాయి. కానీ లెబనాన్‌లో తాజా దాడులతో ఆ ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఒప్పందం తర్వాత మాట్లాడిన వాన్స్.. ఇజ్రాయెల్‌కు పరోక్ష హెచ్చరిక కూడా చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో ఇజ్రాయెల్ పట్ల అత్యంత సానుకూలంగా వ్యవహరిస్తున్న నాయకుడు ట్రంప్ మాత్రమేనని వ్యాఖ్యానించారు.
ఇప్పటికే యుద్ధంతో అల్లకల్లోలంగా మారిన పశ్చిమాసియాలో పరిస్థితులు ఏ దిశగా వెళ్తాయన్న దానిపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. లెబనాన్‌లో హింస ఆగకపోతే ఇరాన్-అమెరికా శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏపీ పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి..

**మొదటిపేజీ తరువాయి**

సమావేశమై రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించారు. కోల్‌కతాలో వీసా స్టీల్ వైస్ చైర్మన్ విశాల్ అగర్వాల్, ఇమామీ గ్రూప్ డైరక్టర్ ఆదిత్య అగర్వాల్, శ్రీ సిమెంట్స్ వైస్ చైర్మన్ ప్రశాంత్ బంగూర్‌లతో లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయని ప్రశంసించారు. దీనికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన కోసం వ్యూహాత్మక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్ కీలక ఆర్థిక భాగస్వామిగా ఎదుగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి ఉన్న విస్తారమైన తీరప్రాంతం,



ప్రపంచ స్థాయి ఓడరేవులు, మెరుగైన లాజిస్టిక్స్, పరిశ్రమలకు అవసరమైన భూమి, నిరంతర విద్యుత్ లభ్యత వంటి అంశాలు పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఇన్వెస్టర్-ఫ్రెండ్లీ పాలసీలు పరిశ్రమల స్థాపనను సులభతరం చేస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటైన 'ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్' ప్లాంట్ పనులు అనకాపల్లి వద్ద ఇప్పటికే ప్రారంభమయ్యాయని, దీంతో రాష్ట్రం ఉక్కు పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా మారుతోందని ఉదహరించారు.
ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు జాతీయ ఆర్థిక ధోరణులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ-పరిశ్రమల సహకారం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో, పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడంలో ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న చురుకైన విధానాన్ని వారు అభినందించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న లోకేశ్ విజ్ఞప్తికి వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

## నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

**మొదటిపేజీ తరువాయి**

పంపిణీ చేయనున్నారు. ఈ నగదు ద్వారా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. మరో వైపు శనివారం ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను విడుదల చేస్తోంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఒకే రోజు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి.
ఇంకో వైపు జూన్ 30వ తేదీన రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.

# సీఎం భరోసా

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తన కుమారుడి అదృశ్యంపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమెకు సీఎం ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. తప్పుచేసింది ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయం చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబుకు చెప్పామని సాయికృష్ణ మేనమామ ముళ్లపూడి నవరంగ్ తెలిపారు. కుటుంబసభ్యులతో సీఎంను కలిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. సాయికృష్ణ తల్లి బాధను సీఎం చంద్రబాబు అర్థం చేసుకున్నారు. బాధ్యులైన అధికారులను శిక్షిస్తామని ఆయన చెప్పారు. మాలాంటి సామాన్యులకు న్యాయం జరగదని భావించాం. కానీ.. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది. రాజకీయంగా మాకు ఎవరిపైనా ద్వేషం లేదు. న్యాయం చేయాలని మాత్రమే సీఎంను కోరాం. ఇలాంటి అన్యాయం మరో మనిషికి జరగకూడదని నవరంగ్ అన్నారు. సాయికృష్ణపై అనేక కేసులు ఉన్నాయి. ఇటీవల అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తలు వచ్చాయి. అయితే సాయికృష్ణ మిస్సయ్యాడంటూ పోలీసులు చెబుతున్నారు. పోలీసులే సాయికృష్ణను హతమార్చారని, లాకప్ డెత్ కింద కేసు నమోదు చేయాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సీఐ నాగరాజును సస్పెండ్ చేయాడంతో పాటు.. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐపీఎస్ అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించింది.

## ఏపీలో రెండు విషాదాంతాలు..

# కుటుంబ కలహాలతో ఏడుగురి మృతి

**ప్రకాశం జిల్లాలో ముగ్గురు కూతుళ్లకు విషమిచ్చి చంపి, తండ్రి ఆత్మహత్య**

**శ్రీకాకుళంలో ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి తల్లి బలవన్మరణం**

**జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):** ఏపీలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన హృదయ విదారక ఘటనలు తీవ్ర విషాదాన్ని నింపాయి. కుటుంబ కలహాల కారణంగా రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఐదుగురు పసిపిల్లలు ఉండటం రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ దారుణాలు చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెండు ఘటనల వెనుక కుటుంబ సమస్యలే ప్రధాన కారణంగా ఉన్నాయి.

**ప్రకాశం జిల్లాలో తండ్రి ఘాతుకం**

ప్రకాశం జిల్లా చిమకుర్తి మండలం అగ్రహారం గ్రామంలో ఓ తండ్రి రాక్షసుడిగా మారాడు. భార్య కాపురానికి రావడం లేదన్న కోపంతో కన్నబిడ్డలనే కడతేర్చాడు. ఏకుల సుధాకర్ (35) అనే వ్యక్తి తన ముగ్గురు కుమార్తెలు గో అచ్యుత (13), పూజిత (11), లోకిత (8)లకు ఆహారంలో విషం కలిపి తినిపించాడు. వారు ముగ్గురూ మరణించారని నిర్ధారించుకున్న తర్వాత గ్రామ శివార్లలోని పొలానికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో సుధాకర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని, ఈ క్రమంలోనే ఈ దారుణానికి ఒడిగట్టాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, నాలుగు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.ద

**శ్రీకాకుళంలో పిల్లలతో తల్లి ఆత్మహత్య**

ఇలాంటిదే మరో విషాద ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పసిపిల్లలతో సహా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. పలాస-తలభద్ర రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌పై మూడు మృతదేహాలను గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతులను పూజ (28), ఆమె కుమారుడు కుశాంత్ (5), కుమార్తె దీక్షిత (3)గా గుర్తించారు.
శ్రీకాకుళం జిల్లా భావనపాడుకు చెందిన పూజకు ఎనిమిదేళ్ల క్రితం అదే జిల్లా చలమయ్యపేటకు చెందిన వెంకటయ్యతో వివాహమైంది. విజయవాడలో నివాసముంటున్న ఈ కుటుంబం, వేసవి సెలవుల కోసం ఇటీవలే చలమయ్యపేటకు వచ్చింది. భర్తతో విభేదాల కారణంగా నిన్న ఉదయం పిల్లలతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయిన పూజ, రాత్రంతా పలాస రైల్వే స్టేషన్‌లో గడిపినట్లు తెలిసింది. ఆ తర్వాత ఈరోజు ఉదయం పిల్లలిద్దరినీ గట్టిగా పట్టుకుని, వేగంగా వస్తున్న రైలు కింద దూకి ప్రాణాలు తీసుకుంది. తన కుమార్తె మృతికి అత్తింటి వేధింపులే కారణమని పూజ తల్లి ఆరోపిస్తున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే రోజు రెండు వేర్వేరు జిల్లాల్లో జరిగిన ఈ ఘటనలతో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం, అందులో ఐదుగురు చిన్నారులు ఉండటం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.

# హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం



**మొదటిపేజీ తరువాయి**

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

**మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి**

**కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు**

**మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్)::** రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.
కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అమెరికా దాడిలో మృతి.. విశాఖకు చేరిన నావికుడు సురేశ్ మృతదేహం



ఒమన్ గల్ఫ్‌లో అమెరికా జరిపిన సైనిక దాడిలో మరణించిన విశాఖపట్నం వాసి, చీఫ్ మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేశ్ (44) మృతదేహం శుక్రవారం నగరానికి చేరుకుంది. ఆయన భౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషాద ఘటనతో శ్రీనివాస్ నగర్‌లోని ఆయన నివాసం ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జూన్ 10న ఒమన్ గల్ఫ్‌లో ప్రయాణిస్తున్న 'ఎంటీ సెట్టెబెల్లో' అనే ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా దళాలు దాడి చేశాయి. ఈ ఘటనలో ట్యాంకర్‌లోని ముగ్గురు భారతీయ సిబ్బంది మరణించగా, 21 మందిని సురక్షితంగా కాపాడారు. మృతుల్లో పట్నాల సురేశ్‌తో పాటు హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆదిత్య శర్మ, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శివానంద్ చౌరాసియా ఉన్నారు. మిగతా ఇద్దరి మృతదేహాలను జూన్ 17నే భారత్‌కు తరలించారు. అమెరికా ఆంక్షలను ఉల్లంఘించి ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నందునే ట్యాంకర్‌పై దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. అయితే, ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసి తన నిరసనను తెలియజేసింది. ఈ సందర్భంగా సురేశ్ భార్య భార్గవి మాట్లాడుతూ, "మా కుటుంబానికి ఆయనే ఏకైక ఆధారం. ఇప్పుడు నేను నా ఇద్దరు పిల్లలను ఎలా పెంచాలి?" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) సురేశ్ కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం సురేశ్ అంత్యక్రియలు నిర్వహించారు.

## వార్షిక రుణ ప్రణాళిక

# రూ.8.10 లక్షల కోట్లు

**మొదటిపేజీ తరువాయి**




ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. మరోవైపు రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించేలా సహకారం అందించాలని కోరారు. కాగా, ఎస్ఎల్‌బీసీ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఆశిష్ పాండే, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ డైరెక్టర్ నీలమ్ అగర్వాల్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్, నాబార్డ్ జీఎం కేవీఎస్ ప్రసాద్, తదితరులు హాజరయ్యారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.2023/87888



# ఫాదర్ ఫెర్రర్ 17వ వర్ధంతి ఘన నివాళులు

**అనంతపురం/గుత్తి, జూన్ 19 : (రిపబ్లిక్ న్యూస్):**



ఆర్‌డీటీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, మానవతావాది ఫాదర్ ఫెర్రర్ 17వ వర్ధంతి సందర్భంగా గుత్తి ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఫాదర్ ఫెర్రర్ 1983 సంవత్సరం నుంచి అనంతపురం జిల్లాలోని 45 మండలాల్లో విద్య, వైద్యం, వాటర్‌షెడ్ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, పండ్ల తోటల అభివృద్ధి, వికలాంగుల సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల గృహ నిర్మాణం, క్రీడాభివృద్ధి వంటి అనేక రంగాల్లో విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాయని కొనియాడారు. ఫాదర్ ఫెర్రర్ సేవలు, ఆశయాలు, సమాజాభివృద్ధి పట్ల ఆయన చూపిన అంకితభావం చిరస్మరణీయమని, ఆయన చేసిన కృషిని ప్రజలు ఎన్నటికీ మరువలేరని పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఆదర్శప్రాయమని అన్నారు. ఈ నేపథ్యంలో ఫాదర్ ఫెర్రర్ 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు బండల రామాంజినేయులు, సీపీఐ మండల కార్యదర్శి జి. రామదాసు, సీపీఐ గుత్తి పట్టణ కార్యదర్శి రాజు యాదవ్, పట్టణ సహాయ కార్యదర్శి నజీర్, మండల కమిటీ నాయకులు మధుసూదన్ రావు, బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట కొండయ్య, సీపీఐ పార్టీ సభ్యులు ఆటో అమర్, ఆటో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల హాస్టల్స్ ఏర్పాటు చెయ్యండి

## -హాస్టల్ వార్డెన్ హారతి దేవి

**ఎమ్మిగనూరు, జూన్, 19,(ప్రజా రిపబ్లిక్న్యూస్ ):**



ఎమ్మిగనూరు నియోజకవర్గ కేంద్రంలోని బాలికల హాస్టల్స్ పెంచండి అంటూ బీసీ హాస్టల్ వార్డెన్ హారతి దేవి పేర్కొన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గ కేంద్రంగా ఉన్న హాస్టలకు చుట్టుపక్క గ్రామాల బాలికలు చదువుకోవడానికి అలాగే వసతి పొందడానికి బీసీ హాస్టల్లో అధికంగా చేరుతున్నారు. గనుక నియోజకవర్గ కేంద్రంలో మరో హాస్టల్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే గత 15 సంవత్సరాల క్రితం బాలికల హాస్టల్ గతంలో గృహం శిథిలావస్థలో ఉంది కనుక మరల దానిని పునర్నిర్మించాలని హాస్టల్ ఏర్పాటు చేయాలని అలాగే నియోజకవర్గంలో రెసిడెన్షియల్ హాస్టల్ పెడితే ఎంతో మేలు అవుతుందని బాలికలు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఈ హాస్టల్లో మినిమం 225 మంది మాత్రమే ఉండాలని,కానీ ఇప్పుడు 500 మంది దాకా వసతి కల్పిస్తున్నా మన్నారు. మరల ఇప్పుడు కొత్తగా 1000 అప్లికేషన్లు వచ్చాయని, అలాగే విద్యార్థుల చదువులు ఎటువంటి అటంకం కలగకూడదు అంటే బాలికలు వసతి కొరకు క్రొత్తగా ఇంకోటి ఏర్పాటు చేస్తే బాలికల చదువు వసతి బాగుంటుందని తెలిపారు.

### నీట్ (యూజీ)-2026 పునఃపరీక్షకు కర్నూలు జిల్లాలో

# కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**16 పరీక్షా కేంద్రాల్లో 4,995 మంది విద్యార్థులు హాజరు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)**



జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 పునఃపరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కర్నూలు జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.

జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 4,995 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి కేంద్రానికి ఒక సీఐ స్థాయి అధికారిని నియమించి, ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు.

జూన్ 21న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నందున విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్టాండ్‌లో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో తల్లిదండ్రులు, బంధువులు గుమికూడకుండా సహకరించాలని కోరిన ఎస్పీ, ఎవరైనా అనుమానాస్పదంగా వ్యవహరించినా లేదా పరీక్షా నిబంధనలను ఉల్లంఘించేందుకు ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు తమ హాల్ టికెట్లలో పేర్కొన్న సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా చదివి పాటించాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మేరకు భద్రతా ఏర్పాట్లు చేసి, విధులను పకడ్బందీగా నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ఏ పరీక్షా కేంద్రం వద్దైనా ఎటువంటి అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే డయల్-112, డయల్-100 లేదా జిల్లా పోలీసు వాట్సాప్ నంబర్ 9121101100కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు

# బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్ 9 మందిపై కేసులు

**బెల్ట్ షాపులపై దాడులు.. 37 మద్యం సీసాల స్వాధీనం - ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు**







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)**

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధమని, అలా మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని తెలియజేస్తూ కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. మద్యం కొనుగోలు చేసిన వారు ప్రభుత్వం అనుమతించిన పర్మిట్ రూమ్‌లలో మాత్రమే మద్యం సేవించాలని అధికారులు సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల ప్రజలకు, రహదారి వినియోగదారులకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టిన అధికారులు గత మూడు రోజులుగా నిర్వహించిన డ్రైవ్‌లో మొత్తం 9 మందిపై కేసులు నమోదు చేశారు. అందులో ఆరుగురిని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినందుకు అరెస్టు చేశారు.

అదేవిధంగా బెల్ట్ షాపుల నిర్వహణపై కూడా దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

బెల్ట్ షాపుల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని, ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు. ప్రజలు చట్టాలను గౌరవించి బహిరంగ ప్రదేశాల్లో మద్యపానానికి దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు.

ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్, సబ్ ఇన్‌స్పెక్టర్లు రెహానా, నవీన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ మారుతి ప్రసాద్, ఎస్‌టీఎఫ్ ఎస్ఐ తేజతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# కర్నూలులో బైక్ చోరీల ముఠా అరెస్ట్..

**రూ.5 లక్షల విలువైన 6 ద్విచక్ర వాహనాల స్వాధీనం**

**ప్రభుత్వ ఆసుపత్రి పార్కింగ్‌లో చోరీ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ సహా ఆరు బైక్‌లు రికవరీ**

**ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)**

కర్నూలు నగరంలో ఇటీవల పెరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కర్నూల్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మోటార్ సైకిల్ చోరీ కేసును ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పీజీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వై. నిరంజన్ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్‌ను ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద ఉన్న పార్కింగ్ ప్రదేశంలో నిలిపి విధులకు వెళ్లారు. అనంతరం తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.జిల్లాలో వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల చోరీల నేపథ్యంలో జిల్లా డీఐజీ, ఇన్‌ఛార్జ్ ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కర్నూలు ఎస్‌డీపీఓ పర్యవేక్షణలో త్రీ టౌన్ సీఐ పి. శేషయ్య, సీసీఎస్ సీఐ పూల రామకృష్ణ నేతృత్వంలోని బృందాలు విస్తృతంగా దర్యాప్తు నిర్వహించాయి.

ఈ క్రమంలో నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని అరుంధతి నగర్‌లో టైల్స్ ఫ్యాక్టరీ వెనుక ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉప్పర వీరేష్, ముక్కెర రాముడు అనే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు బైక్ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో పాటు హెచ్‌ఎఫ్ డీలక్స్, పల్సర్, టీవీఎస్ జూపిటర్, స్ప్లెండర్ ప్లస్, స్ప్లెండర్ ప్రో మోడళ్లకు చెందిన మొత్తం ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో ఒకటి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించినదిగా గుర్తించగా, మిగిలిన వాహనాల యాజమాన్యం, వాటికి సంబంధించిన కేసుల వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన త్రీ టౌన్ సీఐ పి. శేషయ్య, సీసీఎస్ సీఐ పూల రామకృష్ణ, ఎస్ఐ ఎం. చంద్రశేఖర్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ ఎ. వెంకటేశ్వర్లు మరియు పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# కురువలపై దాడులు ఖండనీయం

## : ఎంపీ బస్తిపాటి నాగరాజు

**దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు -బాధితులను స్వయంగా కలుస్తానని హామీ**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)**



జిల్లాలో కురువ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై జరుగుతున్న దాడులను ఎంపీ బస్తిపాటి నాగరాజు తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశాల నిమిత్తం డార్జిలింగ్లో ఉన్న ఆయన ఒక ప్రకటన ద్వారా స్పందించారు.జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురువ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై దాడులు జరగడం విచారకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా కర్నూలు పట్టణంలో కాంట్రాక్టర్ రంగన్నపై జరిగిన దాడిని హేయమైన చర్యగా అభివర్ణించారు.పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ముగిసిన అనంతరం బాధితులను నేరుగా కలిసి పరామర్శిస్తానని ఎంపీ తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.ద

# కప్పట్రాళ్ల లో ఎస్ ఐ ఆర్ పై అవగాహన సదస్సు

**ఓటరు జాబితా సవరణలో ప్రజల భాగస్వామ్యం కీలకం**

**: టీడీపీ సీనియర్ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున**

**దేవనకొండ, జూన్ 19 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**



దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవనకొండ తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో చేపట్టారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితాలను పూర్తిగా ఖచ్చితంగా, పారదర్శకంగా మరియు తప్పులు లేకుండా రూపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన యువత కొత్త ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు.అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లు, డూప్లికేట్‌నమోదుల ను గుర్తించి తొలగించడం ద్వారా ఓటరు జాబితాను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని వివరించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, వయస్సు తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.గ్రామస్థులు తమ వివరాలను బీఎల్‌ఓలకు అందించి సవరణ ప్రక్రియలో సహకరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించే ప్రక్రియలో బీఎల్‌ఓలు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. కార్యక్రమం సందర్భంగా ఓటరు జాబితా సవరణ విధానం, అవసరమైన ధ్రువపత్రాలు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత అవసరమని అధికారులుపేర్కొన్నారు.ఈకార్యక్రమంలో హరి, సీనియర్ అసిస్టెంట్ రవి, బీఎల్‌ఓలు, బీఎల్ఏలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అత్యవసర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత

**అధ్వానంగా ఉన్న రహదారులు, డ్రైనేజీలపై క్షేత్రస్థాయిలో పరిశీలన**

**పూడికతీత పనుల నాణ్యతను కర్రతో పరీక్షించిన కమిషనర్ చల్లా ఓబులేసు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)**

నగరంలోని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రహదారులు, డ్రైనేజీ కాలువల సమస్యల పరిష్కారానికి అత్యవసర ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారపేట, హరిజనవాడ, హబీబ్ ముబారక్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం గణేష్ నగర్, మదర్ ల్యాండ్, రాంప్రియ నగర్, ధనలక్ష్మి నగర్, మారుతి మెగా సిటీ ప్రాంతాల్లో పర్యటించి సమస్యాత్మకంగా మారిన రహదారులు, డ్రైనేజీ కాలువలను పరిశీలించారు.

ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట ప్రతిపాదనలు రూపొందించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మురుగు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయడంతో పాటు, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే డబ్ల్యూబీఎం రహదారుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

ఏవైనా సాంకేతిక లేదా ఇతర సమస్యలు ఎదురైతే వాటి సాధ్యాసాధ్యాలను పరిశీలించి, శాశ్వత పరిష్కారం అందే వరకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. గణేష్ నగర్‌లోని మురుగుకాలువ వద్ద జరుగుతున్న పూడికతీత పనులను స్వయంగా పరిశీలించిన కమిషనర్ చల్లా ఓబులేసు, కర్రతో కాలువ లోతును పరీక్షించి పనుల నాణ్యతపై అధికారులను ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, సానిటేషన్ సూపర్వైజర్ రమేష్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, డీఈఈ నరేష్, ఏఈ జనార్ధన్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దివాకర్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ భావి భారత ప్రధాని

## సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతర పోరాట యోధుడు: డిసిసి అధ్యక్షుడు క్రాంతి నాయుడు









**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)**
కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుడు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ మాట్లాడుతూ రాహుల్ గాంధీ భావి భారత ప్రధానిగా ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడని ఆయన కొనియాడారు. భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలను ఏకం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు రైతులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగుల హక్కుల కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.
రాహుల్ గాంధీ ఆశయాలను గ్రామ గ్రామానికీ, గడప గడపకూ తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, 2029 ఎన్నికల్లో ఆయనను ప్రధానిగా చూడటమే తమ లక్ష్యమని క్రాంతి నాయుడు తెలిపారు.
జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది యువకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేశారు.
అనంతరం రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, రాష్ట్ర నాయకుడు పాట్రిక్ డేవిడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న క్రాంతి నాయుడు, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ భాషా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్‌సీ బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డీవీ సాంబశివుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏ. సూర్యప్రకాశ్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు సజ్జాద్ హుస్సేన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలతతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# యోగాతోనే ఆరోగ్యం, ఐశ్వర్యం

## ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత



**అనంతపురం వైద్యం, జూన్ 19,(రిపబ్లిక్ న్యూస్):**
యోగాతోనే ఆరోగ్యం, ఐశ్వర్యం మన సొంతమవుతుందని అనంతపురం నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత అన్నారు. సర్వజనాస్పత్రిలో గల అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన యోగా ప్రత్యేక కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు యోగాపై అవగాహన కల్పించి, ఆసనాలు వేయించారు. యోగా ట్రైనర్ లలిత సునయన వీరందరికీ శిక్షణ ఇచ్చారు.

**యోగా చేస్తే అన్నీ రకాల రోగాలకు చెక్ పెట్టొచ్చు**
ఈ సందర్భంగా ఆర్.ఎం.ఓ హేమలత మాట్లాడుతూ మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, రసాయన ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తుల వినియోగం, పోటీ ప్రపంచంలో ఉరుకుల పరుగుల జీవితం, పని ఒత్తిడి వంటి అనేక కారణాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దీంతో అనేక రకాల ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టి మనిషి ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు పేర్కొన్నారు. మనిషి ఆయుష్షు కూడా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో మన దైనందిన జీవితంలో యోగా ప్రాధాన్యత ను గుర్తించి, ప్రతి ఒక్కరూ యోగా చేస్తే అన్నీ రకాల రోగాలకు చెక్ పెట్టొచ్చని స్పష్టం చేశారు.

**సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చే శక్తి యోగాకు ఉంది**
దీన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సామాన్యుల నుంచి వీవీఐపీల వరకు యోగా పరిచయం చేయడం, ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడం..అందుకు కోట్లు ఖర్చు చేస్తున్నారంటే యోగాకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవాలన్నారు. మందులకు దూరంగా పెడుతూ.. సంపూర్ణ ఆరోగ్య వంతులుగా మార్చే శక్తి యోగాకు ఉందని డాక్టర్ హేమలత అన్నారు. గర్భిణులు కూడా ప్రతి రోజూ యోగా ప్రాక్టీస్ చేస్తే ఆరోగ్యంతో పాటు పండంటి శిశువులకు జన్మనిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మిల్క్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్లు, పీడియాట్రిక్ వైద్యులు డాక్టర్ హరిణి, డాక్టర్ రాధిక, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాదిగ క్రాంతి ఆత్మహత్యపై సీఎం స్పందించాలి

## ఎమ్మార్పీఎస్ గుండు పోగుల నేపాల్



**మంత్రాలయం, జూన్, 19,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** మాదిగ క్రాంతి ఆత్మహత్యకు కారకుడైన కృష్ణలంక సిఐ నాగరాజును సర్వీస్ నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నేత గుండెపోగుల నేపాల్ డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. "మాదిగగా పుట్టడమే నా తప్పా" అని క్రాంతి ఆవేదన చెంది ఆత్మహత్య చేసుకోవడం విషాదమన్నారు.

# మహోన్నత మానవతా మూర్తి ఫెర్రర్

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 19,(రిపబ్లిక్ న్యూస్):**
పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు తన జీవితాన్ని అంకితం చేసి లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత మానవతా మూర్తి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు కొనియాడారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 17వ వర్ధంతి సందర్భంగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్మారక కమిటీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు.

**ఫాదర్ ఫెర్రర్ చేసిన సేవలు చిరస్మరణీయం**
ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఫాదర్ ఫెర్రర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. మానవతా దృక్పథంతో సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

**లక్షలాది మంది జీవితాల్లో నిలిచిన మహనీయుడు**
ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్మారక కమిటీ కన్వీనర్ హెచ్. నాగలింగయ్య మాట్లాడుతూ స్పెయిన్ దేశానికి చెందిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ తన సతీమణి అన్నే ఫెర్రర్‌తో కలిసి 1969లో అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ)ను స్థాపించి విద్య, వైద్యం, ఉపాధి, మహిళా సాధికారత వంటి రంగాల్లో విశేష సేవలు అందించారని తెలిపారు. లక్షలాది మంది



జీవితాల్లో ఆశాకిరణంగా నిలిచిన మహనీయుడని కొనియాడారు.

**ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానుభావుడు**
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు, తులనాత్మక సాహిత్య శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర మాట్లాడుతూ నిరుపేదలకు పక్కా గృహాలు, పాఠశాలలు నిర్మించి, అత్యాధునిక వైద్యసదుపాయాలతో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానుభావుడు ఫాదర్ ఫెర్రర్ అని పేర్కొన్నారు.

**గ్రామీణ క్రీడాకారులను తీర్చిదిద్దిన ఘనత ఫాదర్ దే**
రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ సాకే హరి మాట్లాడుతూ ఆర్‌డీటీ స్పోర్ట్స్ అకాడమీ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతోమంది యువ క్రీడాకారులను తీర్చిదిద్దిన ఘనత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు దక్కుతుందన్నారు.



ఈ కార్యక్రమంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్మారక కమిటీ నిర్వాహకులు హెచ్. నాగలింగయ్య, సాకే హరి, డాక్టర్ నానీల నాగేంద్ర, తోట నాగరాజు, ఆర్‌డీటీ చైర్మన్ డాక్టర్ హరి నారాయణ, డైరెక్టర్లు రాజశేఖర్ రెడ్డి, రఫిక్, శోభారాణి, బాలాజీ, పుష్ప, డాక్టర్ ఎన్. రంగస్వామి, గాజుల వెంకటసుబ్బయ్య, శంకర కుళ్లాయప్ప, డాక్టర్ జూటూరు షరీఫ్, షేక్ రియాజుద్దీన్ అహ్మద్, గుంటి మురళీకృష్ణ భరద్వాజ్, డాక్టర్ అంకె రామలింగయ్య, డాక్టర్ నగరూరు రసూల్, దాసన్నగారి కృష్ణమూర్తి, ఎర్ర సితార, దాసరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ ఆర్ 11 అగ్రహారంలో ఆర్డీఓ ఆధ్వర్యంలో గ్రామసభ.సిద్దేశ్వరరావు.



**రైల్వేకోడూరు జూన్ 19 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మంగంపేట పంచాయతీ ఆర్ ఆర్ సెంటర్ 11 అగ్రహారం లో శనివారం ఆర్డిఓ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు మండల తాసిల్దారు ఆకుల సిద్దేశ్వరరావు తెలియజేశారు, ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు నియోజకవర్గ జనసేన పార్టీ శాసనసభ్యులు ఆరవ శ్రీధర్,
ఉమ్మడి కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి హాజరు అవుతారని ఆయన తెలియజేశారు, ఈ సమావేశంలో ఆర్ఆర్ సెంటర్11 అగ్రహారం గ్రామస్తులకు పునరావాసం, పునర్వ్యాపాధి కల్పన కల్పించుటకు 2013 భూ సేకరణ చట్టాన్ని అనుసరించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు ఈ విషయమై స్థానిక గ్రామస్తులతో చర్చిస్తారని తెలియజేశారు, ఈ కార్యక్రమం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మంగంపేట పంచాయితీ ఆర్ఆర్ సెంటర్ 11 అగ్రహారంలో మండల ప్రజా పరిషత్ స్కూలు నందు జరుగుతుందని సభకు గ్రామస్థులు అందరూ హాజరు అవ్వాలని ఆయన కోరారు.

# కర్నూలు నగరంలో హత్యాయత్నం కేసు ఛేదన..

## 24 గంటల్లోనే నిందితుల అరెస్ట్

### నిందితులకు జ్యుడీషియల్ రిమాండ్ -కొండారెడ్డి బురుజు వరకు రోడ్డు మార్గంలో నడిపించిన పోలీసులు



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి**
**(రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)**
కర్నూలు నగరంలోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి తైసీమ్ బాషాపై జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. కేసులో ప్రధాన నిందితులైన జలీల్ అహ్మద్, జునైద్, ఫైసల్, ఆరిఫ్‌లను ఘటన జరిగిన 24 గంటల్లోనే అరెస్ట్ చేసినట్లు ఒకటవ పట్టణ సీఐ మారుతి శంకర్ తెలిపారు.కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించిన అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. నేరాలకు పాల్పడడం వల్ల ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై నిందితులకు అవగాహన కల్పించామని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు.
అనంతరం నిందితులను కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు రోడ్డు మార్గంలో నడిపిస్తూ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని సీఐ మారుతి శంకర్ హెచ్చరించారు.చట్టాన్ని గౌరవిస్తూ ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# మహిళా బీఎల్ఓపై దాడి



**అనంతపురం క్రైమ్, జూన్ 19 (రిపబ్లిక్ న్యూస్):**అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 6వ పోలింగ్ స్టేషన్ నారాయణపురం పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న మహిళా బీఎల్ఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎం. హారికపై శుక్రవారం దాడి జరిగింది. ఎస్ఐఆర్ విధుల్లో భాగంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలు అందజేస్తున్న సమయంలో స్థానిక నివాసి శ్రీవిద్య అనే మహిళ తనపై భౌతిక దాడికి పాల్పడి, దుర్భాషలాడినట్లు బాధిత బి ఎల్ ఓ హారిక తెలిపారు.
**నిందితురాలిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్:**దాడి నుంచి ఎలాగోలా తప్పించుకున్న హారిక అనంతరం అనంతపురం ఆర్డీఓ రామ్మోహన్‌తో పాటు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐని కలిసి ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించిన నిందితురాలిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ ఘటనపై అనంతపురం రూరల్ ఎంపీడీఓ దివాకర్ స్పందిస్తూ, మహిళా బీఎల్ఓపై దాడి చేసిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. మండల ఇంజినీర్ వెంకటేశ్వరతో పాటు నారాయణపురం గ్రామ ప్రజలు కూడా బి ఎల్ ఓ కు మద్దతు తెలిపారు.మహిళా బీఎల్ఓపై దాడిని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించింది. బీఎల్ఓలకు భద్రత కల్పించడంతో పాటు ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు వెంకటరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, మల్లికార్జున, రమేష్, జైచిత్ర, దీపిక, కులశేఖర్ రెడ్డి, సాయికిరణ్, ఖాదర్ బాషా, ఆనంద్, రాహుల్, అనిత, బాబ్జాన్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరులో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"

### ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలి

### జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్

**నంద్యాల క్రైం, జూన్ 19, (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమం ద్వారా అధికారులు ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించేందుకు ఇది చక్కని అవకాశం అని జిల్లా ఎస్పీ తెలిపారు. శుక్రవారం ఈ కార్యక్రమం ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఎం.ఎం. ఫంక్షన్ హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా. రాజశేఖర్ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, మరికొందరు జిల్లా అధికారులు పాల్గొన్నారు. అధికారులు



వారి వారి శాఖల వారీగా ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తారని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన వినతులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ఫిర్యాదులలో కొన్ని.....**
1.ఆత్మకూరు పట్టణానికి చెందిన ఆది నారాయణమ్మ, సర్వే నంబర్ 971లో ఉన్న తన 3 ఎకరాల భూమిని బాలస్వామి అనే వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నాడని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
2.మా ఇంటిని వేరే వాళ్లకి బాడుగకు ఇచ్చాము. కానీ ఇప్పుడు వారిని ఖాళీ చేయండి అని అడిగితే ఇల్లు ఖాళీ చేయడం లేదు.కావున మాపై దయ ఉంచి ఇల్లు ఖాళీ చేపించగలరని ఆత్మకూరు పట్టణం కొత్తపేట కాలనీకి చెందిన మున్వర్ బేగం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

# ‘సర్’ ప్రక్రియను నిష్పక్షపాతంగా చేపట్టండి

## కలెక్టర్ ఆనంద్‌ను కోరిన అనంత వెంకటరామిరెడ్డి, శైలజానాథ్

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 19,(రిపబ్లిక్ న్యూస్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, శింగనమల సమన్వయకర్త శైలజానాథ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన ‘సర్’ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలతో పాటు సందేహాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.



**నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించేలా ఆదేశాలు ఇవ్వాలి**

ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికార పార్టీకి చెందిన బీఎల్ఏ (బూత్ లెవల్ ఏజెంట్లు)లు తమకు తెలియకుండా ఏమీ చేయకూడదని బీఎల్ఓ (బూత్ లెవల్ ఆఫీసర్లు)లపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. శింగనమలతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఐదు రోజులుగా వెలుగుచూసిన ఘటనలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బీఎల్ఓలు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. మ్యాపింగ్ అయిన ఓటర్లకు ప్రింటెడ్ ఫారాలు ఇవ్వకుండా అందరికీ ఒకే రకంగా ఎన్యుమరేషన్ ఫారాలు ఇస్తున్నారని తెలియజేశామన్నారు. అదేవిధంగా ఇప్పటి వరకు అన్ మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి వివరాలను డ్రాఫ్ట్‌లో పబ్లిష్ చేస్తారా? లేకపోతే ఇప్పుడే పబ్లిష్ చేస్తారా? ఒక వేళ ఓటర్లు డాక్యుమెంట్స్ ఇవ్వకపోతే పరిస్థితి ఏంటి అనే సందేహాలను కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. చాలా చోట్ల బీఎల్ఓలు, ఈఆర్ఓలకు ‘సర్’ ప్రక్రియపై ఇప్పటికీ అవగాహన లేకపోవడం కూడా ఇబ్బందిగా మారుతోందని అన్నారు. డబుల్, డెత్ ఓటర్లతో పాటు వలస వెళ్లిన వారికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో కలెక్టర్‌ను అడిగామని తెలిపారు. అనంతపురం నగరంలో డెత్, వలస ఓట్లు అధికంగా ఉన్నాయని చెప్పారు. అలాగే చాలా మందికి ఎన్యుమరేషన్ ఫారాలు ఎలా రాయాలో కూడా తెలియదని, ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం నుంచే ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అధికార పార్టీకి చెందిన బీఎల్ఏలు రాకపోతే కొన్ని చోట్ల ‘సర్’ ప్రక్రియను వాయిదా వేస్తున్నారని తెలియజేశారు. ‘సర్’ ముగిశాక ఇంకా డెత్, వలస ఓట్లు అలాగే ఉంటే ఎన్నికల సంఘం లక్ష్యం నెరవేరనట్టేనని స్పష్టం చేశారు. దీంతో రెండ్రోజుల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ ఆనంద్ హామీ ఇచ్చినట్లు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు.

**రెండు, మూడు చోట్ల ఓటు హక్కు ఉండడానికి వీల్లేదు**

మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన బీఎల్ఏలు.. బీఎల్ఓలతో పాటు ఓటర్లపై పెత్తనం చేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఇందుకు సంబంధించి కొన్ని సాక్ష్యాలను కలెక్టర్‌కు అందించినట్లు తెలిపారు. ‘సర్’ ప్రక్రియలో అధికార పార్టీ ప్రమేయం లేకుండా చూడాలని కోరామని, అదే సమయంలో తాము కూడా సహకరిస్తామని స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఒక ఓటరుకు రెండు, మూడు చోట్ల ఓటు హక్కు ఉండడానికి వీల్లేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో తప్పులు జరిగితే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క ఓటు తొలగించకుండా చూడాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వైసీపీ బూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎద్దుల అమర్నాత్‌రెడ్డి, సాకే రిత్విక్, జెడ్పీటీసీ నీలం భాస్కర్ ఉన్నారు.

# జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు పర్యటన

## జూన్ 24న కర్నూలు జిల్లాలో పర్యటన హెలిప్యాడ్, సభా వేదిక, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలం జొన్నగిరిలో ఏర్పాటు చేసిన జియో మైసూర్ గోల్డ్ మైన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు.





ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో కలిసి హెలిప్యాడ్, మైనింగ్ ఏరియా వ్యూ పాయింట్, ప్రాసెసింగ్ ప్లాంట్, బహిరంగ సభా స్థలాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజల కోసం రవాణా, తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

మీడియాతో మాట్లాడిన కలెక్టర్ డా. సిరి, ఈస్టర్న్ ధార్వార్ క్రాటన్ ప్రాంతంలో లభ్యమవుతున్న బంగారు ఖనిజ నిల్వల ఆధారంగా జియో మైసూర్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోందన్నారు. రాష్ట్ర ఖనిజ రంగ అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపుకు, దేశీయ బంగారం ఉత్పత్తి వృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ప్రస్తుతం రోజుకు సుమారు వెయ్యి టన్నుల ఖనిజాన్ని ప్రాసెస్ చేసే సామర్థ్యం ఈ గనికి ఉందని, ప్రతి టన్ను ఖనిజం నుంచి సగటున ఒకటి నుంచి ఒకటిన్నర గ్రాముల వరకు బంగారం వెలికితీస్తున్నారని తెలిపారు. వార్షికంగా సుమారు 30 కిలోల బంగారం ఉత్పత్తి జరుగుతుండగా, విస్తరణ పనులతో ఈ సామర్థ్యం మరింత పెరగనుందని వెల్లడించారు. రెండో ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడుతున్నట్లు చెప్పారు.

పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ, గతంలో వివిధ కారణాలతో ఆలస్యమైన ఈ ప్రాజెక్టుకు ప్రస్తుత ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ అనుమతులు మంజూరు చేసి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుందని తెలిపారు. ఇప్పటికే వందలాది మందికి ఉపాధి లభించిందని, భవిష్యత్తులో దాదాపు వెయ్యి మంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కర్నూలు జిల్లా, పత్తికొండ నియోజకవర్గం, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు.

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భద్రతా చర్యలపై మైన్స్ అధికారులు, పోలీసు అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, డీఆర్ఓ సి. వెంకటనారాయణమ్మ, పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీపీఓ భాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు రైతులకు నాణ్యమైన విత్తనాలు, సబ్సిడీ ఎరువుల పంపిణీ ప్రారంభం

**ఆత్మనిర్భరతా మిషన్ కింద కందుల విత్తనాలు 40 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు**

**ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా పారదర్శక యూరియా పంపిణీ: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)** ఖరీఫ్2026 సీజన్‌లో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, సబ్సిడీ ఎరువులను సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. తుగ్గలి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మనిర్భరతా మిషన్ కింద కందుల విత్తనాలు, సబ్సిడీ పథకం కింద వేరుశనగ విత్తనాలు, అలాగే ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుగ్గలి మండలంలో రైతుల అవసరాలకు అనుగుణంగా 244.8 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఏపీ ఏఐఎంఎస్ పోర్టల్ ద్వారా యూరియా పంపిణీ చేసి, అనంతరం ఈ-పాస్ యంత్రాల్లో నమోదు చేయడం ద్వారా పూర్తి పారదర్శకతను పాటిస్తున్నామని చెప్పారు. యూరియా బస్తా అసలు ధర రూ.1,457 కాగా, ప్రభుత్వం రూ.1,190 సబ్సిడీ అందిస్తున్నందున రైతులకు కేవలం రూ.266.50కే అందుబాటులోకి వస్తోందని వివరించారు. ఆత్మనిర్భరతా మిషన్ కింద మండలంలో 8.8 క్వింటాళ్ల కందుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతర్ పంటల సాగు చేపట్టే రైతులకు ఒక ప్యాకెట్ కందుల విత్తనాలను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే మండలంలో 1,752 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. క్వింటా వేరుశనగ విత్తనాల ధర రూ.10,200 కాగా, ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ కింద రూ.4,080 భరిస్తోందని, రైతులు తమ వాటాగా రూ.6,120 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు అంతర్ పంటలను ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ధృవీకరించిన విత్తనాలు, సబ్సిడీ ఎరువులను వినియోగించి ఖరీఫ్ సీజన్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు.

పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, యూరియా ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని, ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు కందుల విత్తనాలు, వేరుశనగ విత్తనాలు, యూరియా పంపిణీ చేశారు.

## పీర్ల పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలి

**-ఎస్సై సి. వెంకటరమణ**





**చిప్పగిరి, జూన్, 19,( రిపబ్లిక్ న్యూస్)**పీర్ల పండగ సందర్భంగా చిప్పగిరి మండలం బంటనహాల్ గ్రామాల ప్రజలతో చిప్పగిరి ఎస్సై సి. వెంకటరమణ, సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించి గ్రామంలో ప్రజలందరూ కలిసి పండుగ జరుపుకోవాలని, ఆలాయి ఆడుతూ ఎవరూ మారణాయుధాలు ధరించరాదని, మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగించవద్దని, పచ్చని చెట్లను నరికి అడవుల్లోకి విసిరేయవద్దని నిర్వాహకులకు తెలియజేసారు ఈ కార్యక్రమం ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి.

**గుంతకల్ జూన్ 19 ( ప్రజా రిపబ్లిక్ ప్రతినిధి )** గుంతకల్ పట్టణం నందు శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ పరిశీలిస్తున్న మున్సిపాల్ కమిషనర్ లక్ష్మీదేవి క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతూ ఉదయం మరియు మధ్యాహ్నం రాత్రి సమయంలో భోజనం ప్రజలకు అందరికీ అందుబాటులో పరిశుభ్రంగా ఉండాలని తెలియజేశారు అలాగే ప్రజలకి భోజనం మరియు త్రాగడానికి నీళ్లు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని చెప్పారు అది మన అందరి బాధ్యత అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది మరియు ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ సిబ్బంది పాల్గొన్నారు.





## గుత్తి కోటలో యోగాంధ్ర-2026కు ఏర్పాట్లు పూర్తి




**అనంతపురం/గుత్తి, జూన్ 19:( రిపబ్లిక్ న్యూస్):** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుత్తి కోటపై ఉన్న గుర్రపు శాల ప్రాంగణంలో యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం 6 గంటలకు జరగనుంది.

అనంతపురం జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొననున్నారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సామూహిక యోగాభ్యాసం నిర్వహించడంతో పాటు యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో గుత్తి పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అధికారులు కోరారు. చారిత్రాత్మక గుత్తి కోట వేదికగా నిర్వహిస్తున్న ఈ యోగాంధ్ర-2026 కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జబ్బర్ మియా, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, మునిసిపల్ మేనేజర్ రాంబాబు, మున్సిపల్ డి ఈ హేమచంద్ర, మున్సిపల్ సిబ్బంది సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**అనంతపురం / రాయదుర్గం, జూన్ 19,(రిపబ్లిక్ న్యూస్ ):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను రాయదుర్గంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వై. మధుసూదన్ రెడ్డి, రాయదుర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గౌని ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఊరువాకిలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత సాధికారత, రైతు సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజానాయకుడు రాహుల్ గాంధీ అని నేతలు కొనియాడారు. ప్రతి భారతీయుడి గొంతుకకు ప్రాధాన్యం కల్పిస్తూ సమ సమాజ స్థాపన, సోదరభావంతో కూడిన భారతదేశ నిర్మాణం కోసం ఆయన చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భావితరాల ప్రధానిగా రాహుల్ గాంధీని చూడాలని తమ ఆకాంక్ష అని, ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు వద్దే జయన్న, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, రఫీక్ ఉమర్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు అనిల్ కుమార్, జోసెఫ్, బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర పంటల విధానమే మేలు !

**జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**
దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతుతెత్తేస్తున్నాయి.
ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు. అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి.ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరపున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది.



రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ÷ాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

**స్కూల్ పిల్ల భద్రతపై యాజమాన్యాలదే బాధ్యత -స్కూల్ యాజమాన్యాలతో భేటీఓ సిపి సజ్జనార్**

**హైదరాబాద్,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**
మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు క్షమించమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'స్కూల్ పిల్లల భద్రత'పై స్కూల్ యాజమాన్యాలు, సంబంధిత శాఖలతో ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిటీ పరిధిలో 3500లకు పైగా స్కూల్స్ ఉన్నాయని, వీటిలో 12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్విరాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం



చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్‌మ్యాప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు. స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్స్‌పై నిఘా ఉంచాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ వాలంటీర్లు, మార్షల్స్‌ను విద్యాసంస్థలు నియమించుకోవాలని అన్నారు. పిల్లలు తెలిసీ తెలియక నేరాల్లో ఇన్వాల్వ్ అవుతున్నారని.. పిల్లలపై టీచర్స్, పేరెంట్స్ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని... అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 45 మంది విద్యార్థులు యాక్సిడెంట్లో చనిపోతున్నారని, యాక్సిడెంట్లు మర్డర్ల కంటే ప్రమాదకరమన్నారు. అందుకే స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

# మెకెదాటు డ్యామ్ నిర్మాణం కుదరదు

**కావేరి డెల్టా రైతులకు తీరని నష్టం**

**కర్నాటక తీరుకు నిరసనగా తమిళ అసెంబ్లీలో తీర్మానం**

**చెన్నై,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**



కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. డ్యామ్ నిర్మాణంతో కావేరి డెల్టా రైతులకు తీవ్ర- నష్టం కలుగుతుందని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత నెలలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భంగా మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కావేరి నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆమోదం లేకుండా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీలులేదని, ఈ విషయమై కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరులకు శాఖకు ఆదేశాలివ్వాలని మోదీని కోరారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య వివాదానికి దారి తీసిన మేకెదాటు ప్రాజెక్ట్‌పై తమిళనాడు అసెంబ్లీలో కీలక తీర్మానం జరిగింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కర్ణాటక ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ తుది అవార్డుతో పాటు.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పర్యావరణ, సాంకేతిక అనుమతులు సహా ప్రాజెక్టుకు సంబంధించిన ఎలాంటి అనుమతులూ ఇవ్వొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి కాంగ్రెస్, వీసీకే, ఇతర పార్టీలు మద్దతు తెలిపాయి.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకి బెయిల్ మంజూరు



**హైదరాబాద్ జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**
హైదరాబాద్ శివారు గండిపేటలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా, ఫేక్ జీవో కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి రంగారెడ్డి జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు మూడు రోజుల పాటు ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగిసిన అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం బెయిల్ ఇస్తూ తీర్పునిచ్చింది.విచారణ సమయంలో, బ్రహ్మనాయుడు కస్టడీలో ఏ ప్రశ్నకు సరైన సమాధానాలు చెప్పలేదని, దర్యాప్తునకు ఆశించిన స్థాయిలో సహకరించలేదని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, కస్టడీ గడువు ముగిసినందున ఆయన బెయిల్‌కు అర్హుడేనని బొల్లా న్యాయవాదులు వాదించారు.
ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం... ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. రూ. 20 వేల చొప్పున ఇద్దరు పూచీకత్తులు (ష్యూరిటీలు) సమర్పించాలని ఆదేశించింది. అలాగే, ప్రతి 15 రోజులకు ఒకసారి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని, కేసు విచారణను లేదా సాక్షులను ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రభావితం చేయకూడదని కోర్టు స్పష్టమైన షరతులు విధించింది.

# డీఎస్సీ అవకతవకలు, అమరావతి నిర్మాణ వ్యయంపై సీబీఐ దర్యాప్తు జరగాలి: వైవీ సుబ్బారెడ్డి

**ఒక్కో పోస్టును రూ. 10 నుంచి 15 లక్షలకు అమ్ముకున్నారన్న సుబ్బారెడ్డి**

**వేలాది మంది మెరిట్ విద్యార్థులు నష్టపోయారని ఆవేదన**

**అమరావతిలో చదరపు అడుగుకు రూ. 20,500 ఖర్చు చేస్తున్నారని విమర్శ**



**జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన డీఎస్సీ నియామకాల్లో భారీగా అక్రమాలు జరిగాయని, కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు అవినీతిమయంగా మారాయని వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏపీలో జరుగుతున్న అవినీతి, శాంతిభద్రతల క్షీణతపై కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాల్లో అర్హులైన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.
డీఎస్సీ పరీక్షల నిర్వహణలో పేపర్ లీకేజీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. ఒక్కో పోస్టును రూ. 10 లక్షల నుండి రూ. 15 లక్షల వరకు అమ్ముకున్నారని, స్పోర్ట్స్ కోటా పేరుతో అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసిన వారికి, వారి సానుభూతిపరులకే ఔట్‌సోర్సింగ్, ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చుకున్నారని విమర్శించారు. దీనివల్ల వేలాది మంది మెరిట్ విద్యార్థులు నష్టపోయారని, దీనికి సంబంధించిన ఆధారాలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున నిధుల లూటీ జరుగుతోందని వైవీ సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. "కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఒక చదరపు అడుగు నిర్మాణానికి రూ. 5,000 లోపే ఖర్చు చేస్తుంటే.. కూటమి ప్రభుత్వం అమరావతిలో చదరపు అడుగుకు ఏకంగా రూ. 20,500 అంచనా వ్యయం చూపిస్తోంది. దేశంలోని ఏ ప్రధాన నగరంలోనూ ఈ స్థాయి నిర్మాణ ఖర్చులు లేవు. అలాగే, జాతీయ రహదారుల సంస్థ కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి రూ. 20 కోట్లు ఖర్చు పెడుతుంటే... ఏపీ ప్రభుత్వం మాత్రం అమరావతిలో కిలోమీటర్‌కు రూ. 58 కోట్లు కేటాయించింది. రూ. 2 లక్షల కోట్ల ప్రజాధనాన్ని తమకు అనుకూలమైన రియల్ ఎస్టేట్ సంస్థల ప్రయోజనాల కోసం దోచిపెడుతున్నారు" అని దుయ్యబట్టారు. ఈ భూముల కేటాయింపులు, వ్యయాలపై కూడా సీబీఐ విచారణ జరగాలన్నారు.

# దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

**పదిగ్రాములపై 3వేలకు పైగా దిగివచ్చిన ధరలు**

**న్యూఢిల్లీ,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**



దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ. 1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ. 3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ. 2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ. 8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ. 2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.

# జిమ్‌లపై పోలీసుల దాడులు

**శరీరాకృతి కోసం స్టెరాయిడ్స్ వినియోగం**

**హైదరాబాద్,జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):** నగరంలోని పలు జిమ్‌లపై ఏసీపీ ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇటీవల జిమ్‌లలో వరుసగా యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనల నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. శరీరాకృతి కోసం స్టెరాయిడ్లను విచక్షణారహితంగా వాడటం వల్ల తీవ్రమైన గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు హైదరాబాద్‌లోని పలు జిమ్‌లలో వరుసగా తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం కుల్సుంపురా, టప్పాచబుత్ర, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లోని జిమ్‌లలో పోలీసుల ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో శరీరాకృతి కోసం యువత యధేచ్ఛగా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, మాత్రలు వాడుతున్నట్లు గుర్తించారు. జిమ్‌లలో యువకులను కలిసిన ఏసీపీ.. స్టెరాయిడ్ల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. షార్ట్‌కట్ పద్ధతులను వదిలి, సహజ పద్ధతుల్లోనే ఫిట్‌నెస్ సాధించాలని యువతకు పోలీసులు సూచనలు చేస్తున్నారు.

## బీఎస్పీ జాతీయ నేతలను కలిసిన జిల్లా నాయకులు



**కరీంనగర్ ప్రతినిధి జూన్ 19 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** కుమురం భీమ్ అసిఫాబాద్ :– బహుజన సమాజ్ పార్టీ ఛీఫ్ సెక్టార్ కో ఆర్డినేటర్లు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ఇంచార్జ్ లైన మాజీ ఎమ్మెల్సీ అతర్ సింగ్ రావు సురేష్ ఆర్య బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ లను ఈ రోజు రాష్ట్ర కార్యాలయంలో జోన్ ఛీఫ్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం ఆద్వర్యం లో అదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి సాలం బీన్ హసన్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు దుర్గం తుకరాం జిల్లా ఉపాధ్యక్షులు ముదస్సీర్ హుస్సేన్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సిరాజుద్దీన్ లు మర్యాద పూర్వకంగా కలిసి సాలం బీన్ హసన్ అతర్ సింగ్ రావు కు పుష్పగుచ్ఛం అందించి శాలువా తో సత్కరించగా తుకరాం సురేష్ ఆర్య కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ తో సత్కరించారు. అనంతరం జిల్లాలో పార్లమెంట్ లో పార్టీ స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ముస్లిం సమాజం యొక్క ఇబ్బందుల పైన వారి రాజకీయ ఉద్దేశ్యం పైన వారి అవసరాల మీద జిల్లా నాయకులను విచారించారు. జిల్లా కమిటీ అసెంబ్లీ కమిటీ లను సెక్టార్ కమిటీలను మరియూ బూత్ కమిటీ లను పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఎస్ ఐ ఆర్ మీద ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పేద ప్రజల ఓట్లు ముక్యంగా బహుజనుల ఓట్లు గల్లంతు కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మరోక ఛీఫ్ జోన్ ఇంచార్జ్ దయానంద్ రావ్ రాష్ట్ర కోశాధికారి నాయిని ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు

## జోగిపేట్ నూతన ఎస్సై గిరి శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఆబేద్



**అందోల్ ప్రతినిధి జూన్ 19( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
అందోల్ మండలం జోగిపేట్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై గిరి శ్రీకాంత్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ ఆబేద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జోగిపేట్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించే దిశగా ఎస్సై గిరి శ్రీకాంత్ పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై గిరి శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రజల సహకారంతో శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో**

**"విసిన్ ని రియాలిటీ గా మార్చే నాయకుడు" - కేక్ కట్ చేసి జేజేలు**





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 19 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**మెదక్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలను మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ రావు గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈరోజు మెదక్ కాన్సెన్సీలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు గారు రాహుల్ గాంధీ గారి ఫ్లెక్సీ వద్ద కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనే నినాదంతో వేసిన బ్యానర్ ముందు కార్యక్రమం జరిగింది. రాహుల్ గాంధీ గారి ఆలోచనలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, పేదల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న పోరాటాన్ని ఎమ్మెల్యే గారు కొనియాడారు. ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు గారు మాట్లాడుతూ: "రాహుల్ గాంధీ గారు యువతకు ఆదర్శం. ఆయన విజన్ ను మనం గ్రౌండ్ లెవల్ లో రియాలిటీ గా మారుద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత బస్ ప్రయాణం అన్నీ రాహుల్ గారి స్ఫూర్తితోనే అమలవుతున్నాయి. రాహుల్ గారికి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కలగాలని కోరుకుంటున్నా" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మండల అధ్యక్షులు, సర్పంచులు, యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీ గారికి జేజేలు పలికారు. అనంతరం అందరికీ లడ్డూలు పంపిణీ చేశారూ

## మెదక్ జిల్లా డి పి ఆర్ ఓ అధికార పార్టీకి తోత్తుగా పనిచేస్తున్నారు

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 19( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
మెదక్ జిల్లా కలెక్టరేట్ డి పి ఆర్ ఓ తన ఒక హోదాలో ఉండి ఒక రాజకీయ పార్టీ కి సపోర్ట్ గా వార్త ప్రచురణలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం. దీని వెనకాల ఎవరున్నారనేది గుసగుసలు వినబడుతున్నాయి. ఒక ప్రజా ప్రతినిధిగా ఉండి జిల్లా డిపిఆర్ఓ గ్రూపులో ఇస్తున్న వార్తలు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కీ అనుగుణంగా ఇవ్వడం వెనకాల ఏమి అంతర్యం ఉందని ప్రజల విమర్శలు. ప్రజా సమస్యల పైన స్పందిస్తూ ప్రజలకు అండ దండలుగా ఉండాల్సిన ఒక ప్రజా ప్రతినిధిగా విధులు నిర్వహిస్తూ ఒక రాజకీయ పార్టీ నాయకునికి అనుకూలంగా వార్తా ప్రచురణ చేయడం ఎంతవరకు సమంజసం అంటే దీన్నిబట్టి నేరుగా డి పి ఆర్ ఓ గ్రూప్లో ఒక రాజకీయ పార్టీకి ఎమ్మెల్యేకు అనుకూలంగా పెట్టడం దీని వెనకాల ఎమ్మెల్యేకు డిపిఆర్ఓ ఏదో ఒక సంబంధం ఉన్నాయి అనే సందర్భం విన బడుతున్నయి వెంటనే డిపిఆర్ఓ ను తొలగిస్తేనే మెదక్ జిల్లాలో సమస్యలు లేకుండా జిల్లా యంత్రాంగం ఉంటుందని ప్రజల వినికిడి

## అందోల్ మండలం మాసన్ పల్లి గ్రామంలో పాల్వంచ సన్నీ జన్మదిన వేడుకలు



**అందోల్ ప్రతినిధి జూన్ 19 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ఈరోజు మాసంపల్లి పాల్వంచ సన్ని s/o పాల్వంచ కేశవులు జన్మదిన సందర్భంగా మాసంపల్లి గ్రామంలో విద్యార్థులకు బుక్కుల పంపిణీ చేయడం జరిగింది. మరియు జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం చేయడం ఎంతో సంతోషకరమైన విషయం. ఈ కార్యక్రమం సన్నీ అన్న సన్నిహితులు స్నేహితులు మరియు గ్రామ పెద్దల సమక్షంలో చేసుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం.

# నీట్ (యూజీ)2026 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 19 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
జిల్లాలో ఈ నెల 21న (ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ లో నిర్వహించనున్న నీట్ (యూజీ)2026 పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.
జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 01 పరీక్షా కేంద్రాశీలో మొత్తం 481మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన వెల్లడించారు. పరీక్షా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.
ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

**అభ్యర్థులు వెంట తీసుకురావాల్సినవి:**
- ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు
- ఆధార్ కార్డు / పాన్ కార్డు / పాస్‌పోర్ట్ / స్టూడెంట్ ఐడీ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు
- రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజ్ ఫోటో
-పారదర్శక (ట్రాన్స్‌పరెంట్) నీటి బాటిల్ మాత్రమే

**పాటించాల్సిన సూచనలు:**
- అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం (మధ్యాహ్నం 1.30 గంటలు) కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
-ఇన్విజిలేటర్ సమక్షంలో ఓఎంఆర్ షీట్, హాజరు పట్టికపై సంతకాలు చేయాలి
-పరీక్షా కేంద్రంలో ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి

**నిషేధిత వస్తువులు:**
- స్వంత పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు తీసుకురావద్దు
ఓఎంఆర్ షీట్‌పై అనవసర గుర్తులు చేయరాదు
అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రుమాలు, మొబైల్ ఫోన్, ఏ రకమైన గడియారం , బెల్ట్, ఆభరణాలు (ఉంగరాలు, గొలుసులు, చెవిపోగులు మొదలైనవి), ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరాలు, పెన్సిల్, రబ్బరు, షార్ప్‌నర్, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటి వస్తువులను తీసుకురావద్దు.
పై పేర్కొన్న వస్తువులలో ఏదైనా అభ్యర్థి వద్ద ఉన్నట్లు గుర్తిస్తే, అతడిని/ఆమెను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
పరీక్షా గదిలో మొబైల్ ఫోన్ లేదా ఇతర నిషేధిత వస్తువులు కలిగి ఉన్నట్లు తేలితే, అది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. అలాంటి సందర్భంలో అభ్యర్థి అభ్యర్థిత్వం (ఝుఅఇఅఝ్బతీవ) రద్దు చేయబడటంతో పాటు, భవిష్యత్తులో నిర్వహించే పరీక్షలకు కూడా అనర్హుడిగా ప్రకటించబడతారు.
అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం చిరునామాను ముందుగానే ధృవీకరించుకుని, పరీక్షా రోజున సమయానికి కేంద్రానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.
నీట్ (యూజీ)2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు.
అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష కోసం పోలీస్ శాఖ నుండి బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ , మెదక్ ఆర్డిఓ రమాదేవి , డీఎస్పీ ప్రసన్నకుమార్ సంబంధిత రెవిన్యూ, పోలీస్, వైద్య, తపాలా, విద్యుత్, ఆర్టీసీ, రవాణా, ఎడ్యుకేషన్,

# జాతీయ మెగా లోక్‌అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ






**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 19 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
మెదక్ జిల్లా న్యాయస్థానంలో పరిధిలో ఈనెల 20 తేదీన ఉదయం 10 గంటలకు జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయశాఖ చైర్పర్సన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తెలిపారు .
శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాజీ పడదగిన కేసులన్నీ రాజకుదురుకొని సంతోషంగా ఉండాలన్నారు. ప్రతి మనిషిలో క్షేమ గుణం కలిగి ఉండాలన్నారు. రాజకుదురుచుకుంటే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. క్షణికావేశంలో పెట్టుకున్న కేసులన్నీ రాజకుదురుచుకుంటే ఇది వర్గాలు సంతోషంగా స్నేహపూర్వకంగా ఉండొచ్చు అన్నారు భార్యాభర్తలు తగాదాలను పడితే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి రాజకీయం ద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు .
మెదక్ జిల్లాలో నేటి వరకు సుమారు 3వేల కేసులు రాజీ కుదిర్చినట్లు తెలిపారు.
రేపు మెగా జాతీయ లోక్ అదాలత్ లో కేసులను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఫస్ట్ ఎడిషనల్ కోర్టు జడ్జ్ శ్రీమతి సుబవల్లి జిల్లా న్యాయ అధికార సంస్థ కార్యదర్శి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

# విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 19( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
శుక్రవారం బడావత్ రాఘవేందర్, హవేలీఘనపూర్ మండలం పోచంరాల్ తండాకు చెందిన విద్యార్థి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బూరుగుపల్లిలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని, బీసీ హాస్టల్‌లో నివసిస్తూ విద్యను అభ్యసించాడు. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించినందుకు, జిల్లా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ కాలేజెస్ పథకం ద్వారా హైదరాబాద్ బోడుప్పల్‌లోని ఎస్.ఆర్. జూనియర్ కళాశాలలో ఉచిత సీటు పొందాడు.
ప్రభుత్వ సహకారంతో ఇంటర్మీడియట్ విద్యను విజయవంతంగా పూర్తి చేశాడు. తెలంగాణ ఈఏపీసెట్ పరీక్షలో సుమారు 2000 లోపు ర్యాంకు సాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించి, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో కూడా మంచి ప్రతిభ కనబరిచాడు.
ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ వారణాసి లో కంప్యూటింగ్ అండ్ మ్యాథమెటిక్స్ బ్రాంచ్‌లో ప్రవేశం పొందాడు.
ఈ సందర్భంగా విద్యార్థి నేడు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశాడు.
కలెక్టర్ మారుమూల గ్రామం నుంచి ఐఐటీ వారణాసి వరకు అతని విద్యా ప్రస్థానాన్ని అభినందిస్తూ, ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం తరఫున అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చదువును ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని, విద్య ఒక మనిషిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుందని విద్యార్థికి సూచించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.
ఈ కార్యక్రమంలో ఐ=ూ అంబాదాస్ రాజేశ్వర్ , జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు ఏఎస్ఓ నవీన్, జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి మురళీమోహన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూరుగుపల్లి ప్రధానోపాధ్యాయులు రమేష్ మరియు రాఘవేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సర్వే నెంబర్ 203 అక్రమ కట్టడాలు

## జోగిపేటలో కనిపించని వైయస్ఆర్ చిల్డ్రన్స్ పార్క్ - మరో ఘటన వెలుగులోకి వచ్చిన భూ కబ్జా





**అందోల్ పతినిధి జూన్ 19( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
జోగిపేట, సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం లో జోగిపేట నగర పంచాయతీకు పరిధిలో అనుకొని ఉన్న వైయస్ ఆర్ చిల్డ్రన్స్ పార్క్ కనిపించకుండా రోజు రోజుకు పోతుంది. గత తెలుగుదేశం ప్రభుత్వం నాటి, మద్రి ప్రదీప్ వార్డు మెంబెర్ గా ఉండి చేపిచ్చినారు. సర్వేనెంబర్ 203 ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్ చిల్డ్రన్స్ పార్క్ అను పేరు పెట్టి కాలనీ ప్రజలకు ఆట ఆడేందుకు అక్కడ ఇక్కడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్నటువంటి మైదానం శాల దూరం అవుతుండడంతో ఇక్కడున్నటువంటి 20వార్డులకు సంబందించిన ప్రజల పిల్లలకు ఆట ఆడడానికి స్థలం లేనందున అప్పటి ప్రభుత్వంలో నిర్మించినటువంటి వైయస్సార్ చిల్డ్రన్స్ పార్కు కు కాలనీవాసులు మరియు జోగిపేట పట్టణ ప్రాంత వాసులందరూ ఇక్కడికి వచ్చి కొత్తగా నిర్మించినటువంటి వైయస్సార్ చిల్డ్రన్స్ పార్కును సందర్శించేవారు ఉదయం పూట గాని, సాయంత్రం పూట గాని పిల్లలతో సరదాగా, తల్లిదండ్రులు వారి యొక్క చుట్టాలు బంధువులు అందరూ కలిపి ఇక్కడ పార్కులో సందడి చేసేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో మాత్రం పార్కు మాత్రం కనిపించకుండా పోతుంది. ఓవైపు పార్కు వెళ్లాలంటే ఎంట్రన్స్ వద్ద కిరాణా షాపు వంటి డబ్బా నిర్మించారు. మరోవైపును గోడను కూల్చేసి అక్రమ కట్టడాలు డెస్మేటు లేపి విడిచిపెట్టారు. అతి భారీ ఇనుప రాడ్లతో నిర్మిస్తున్నటువంటి కట్టడం దేని గురించి తెలియని పరిస్థితిలో కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పుడు ఉన్నటువంటి కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు ఆటలకు పార్కులకు భారీ నిధులు కేటాయించడంతో ఈ ప్రభుత్వంలో పిల్లలకు మానసికంగా ఉత్సాహంగా ఉల్లాసంగా గడపాలని వారు ఎల్లవేళలా ప్రతి స్పీచ్ లో చెబుతుంటారు.. కానీ ఇక్కడ మాత్రం సంగారెడ్డి జిల్లా జోగిపేట మున్సిపల్ పట్టణంలో మాత్రం విచ్చలవిడిగా ఎవరి అండతో నడుస్తుందో తెలియడం లేదు భూ కబ్జాలు, మా కాలనీ ప్రాంత ప్రజలు కనీసం ఈ ప్రభుత్వంలో చిల్డ్రన్స్ పార్కే లేదు, ఆట ఆడడానికి స్థలమే లేదు, ఇక్కడ నుండి పోవాలంటే పెద్ద చెరువు దాదాపు రెండు కిలోమీటర్ల9వార్డులో అయ్యప్ప గుడికి దగ్గరకి నడిచి పోయి అక్కడ ఆట ఆడాల్సిన పరిస్థితి వచ్చింది, ఇప్పటికైనా సంబంధించిన జోగిపేట మున్సిపల్ అధికారులు స్పందించి పనులు నిలిపివేయాలని యధావిధిగా వై యస్ ఆర్ చిల్డ్రన్స్ పార్క్ ఏ విధంగా అయితే ఉండే అదే విధంగా చేస్తే బాగుంటుందని జోగిపేట పట్టణ వాసులందరూ కోరుతున్నారు....

## ఇంధన పొదుపుకు అధికారుల వినూత్న అడుగు

**వ్యక్తిగత వాహనాలకు బదులు బస్సుల్లో ప్రయాణించిన జిల్లా యంత్రాంగం**

**"వన్ మంత్ - ఫోర్ విజిట్"లో ఆదర్శంగా నిలిచిన నంద్యాల అధికారులు**



**నంద్యాల బ్యూరో, జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):**ఇంధన పొదుపు కేవలం నినాదంగా కాకుండా ఆచరణలో కూడా సాధ్యమేనని నంద్యాల జిల్లా అధికారులు నిరూపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం వ్యక్తిగత వాహనాలను పక్కనపెట్టి, సమిష్టిగా బస్సుల్లో ప్రయాణిస్తూ ప్రజలకు ఆదర్శవంతమైన సందేశాన్ని అందించింది. శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి హాజరయ్యేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ప్రాంగణం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజలకు సందేశం ఇచ్చే ముందు అధికారులు స్వయంగా ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లా, డివిజనల్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు విడివిడిగా వాహనాలు వినియోగించకుండా బస్సుల్లో సమిష్టిగా ప్రయాణించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమం ప్రతి పర్యటనలో ఇదే విధానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంయుక్త తనిఖీలు, సమావేశాలు, అధికారిక పర్యటనల సందర్భాల్లో ఒకే వాహనాన్ని వినియోగించడం ద్వారా ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా ప్రభుత్వ వ్యయాలు కూడా ఆదా అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ చర్య ప్రజల్లో ఇంధన పొదుపుపై మరింత అవగాహన పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: కలెక్టర్ డా. ఏ. సిరి

**తుగ్గలి మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ**

**అర్జీలను వేగంగా, నాణ్యంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 19)** ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం, రెవెన్యూ పరిపాలనలో పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండల కేంద్రంలో నిర్వహించిన రెండో పర్యటన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటిని వేగవంతంగా మరియు నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే పరిష్కరించిన అర్జీలు, పురోగతిలో ఉన్న అర్జీల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచామని, దరఖాస్తుదారులు తమ అర్జీల స్థితిని సులభంగా తెలుసుకునేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అప్పటికప్పుడు పరిష్కరించగలిగే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, మరికొంత సమయం అవసరమయ్యే సమస్యల విషయంలో పరిష్కారానికి పట్టే గడువును ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తామని కలెక్టర్ వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్‌తో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా

# ఆత్మకూరులో ప్రత్యేక గ్రీవెన్స్ వేదిక

**అర్జీలపై క్షేత్రస్థాయి పరిశీలనతో నెల రోజుల్లో పరిష్కారం లక్ష్యం**

**ప్రతి సమస్యపై అధికారుల వ్యక్తిగత బాధ్యత, ప్రజలకు నేరుగా సమాచారం అందజేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల బ్యూరో, జూన్ 19( రిపబ్లిక్ న్యూస్):** ప్రజల నుంచి అందిన వినతులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని ఎం.ఎం. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాలతో పాటు, ప్రతి నెల ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి అక్కడ వరుసగా నాలుగు వారాల పాటు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో విజయవంతంగా అమలు చేసిన ఈ విధానాన్ని ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను నేరుగా ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీలు సమర్పించిన వారికి రశీదులు అందజేసి, వచ్చే బుధవారం లోపు ఆయా గ్రామాల్లో అధికారుల బృందాలు పర్యటించి సమస్యలను పరిశీలిస్తాయని తెలిపారు. ఇళ్లు, స్థలాలు, పెన్షన్లు, రెవెన్యూ అంశాలు, భూమి వివాదాలు సహా ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యల స్వభావాన్ని బట్టి మండల, నియోజకవర్గ, జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో పరిష్కార చర్యలు చేపడతామని, రాష్ట్ర స్థాయికి పంపాల్సిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిష్కారం సాధించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, అవసరమైన చోట వ్యక్తిగతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిపై నిరంతర సమీక్ష ఉంటుందని, పూర్తి చేసిన పనులు, ఆర్థిక అనుమతులు పొందిన అంశాలు, ఆర్థికేతర సమస్యల పరిష్కార వివరాలను క్రమం తప్పకుండా నివేదించాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. త్వరలో అధికారులకు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించి కార్యాచరణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ప్రజా సమస్యల పరిష్కారాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన గ్రీవెన్స్ వ్యవస్థను ఇప్పుడు నియోజకవర్గ స్థాయికి విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలిగిందన్నారు. నెలలో వచ్చే నాలుగు వారాల్లో ఒక్కో మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పరిష్కరించగల అంశాలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా క్రమపద్ధతిలో తమ సమస్యలను అధికారులకు వివరించి, ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

**ప్రత్యేక పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన వినతులు**

1)ఆత్మకూరు మండలానికి చెందిన షేక్ రిజవ్వాన తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, ప్రస్తుతం తన అత్తగారి హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్‌లో తన భర్త హుస్సేన్ పేరు లేకపోవడంతో, ఆయన పేరును కూడా అదే హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్‌లో చేర్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.





2)ఆత్మకూరు పట్టణానికి చెందిన సి. ఆది నారాయణమ్మ, సర్వే నంబర్ 971లో ఉన్న తన 3 ఎకరాల భూమిని బాలస్వామి అనే వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నాడని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు.

3)ఆత్మకూరు పట్టణంలోని ఇందిరా గాంధీ నగర్‌కు చెందిన కె. రూపవతి, తాను గతంలో మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో పనిచేసినప్పటికీ ప్రస్తుతం ఉద్యోగం మానేశానని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో తాను టీజీటీ హిందీ ఉపాధ్యాయురాలిగా, ప్రభుత్వ ఉద్యోగిగా నమోదై ఉండటంతో "తల్లికి వందనం" పథకం ప్రయోజనం అందడం లేదని పేర్కొన్నారు. అందువల్ల తన పేరును ప్రభుత్వ ఉద్యోగుల జాబితా నుంచి తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు

## జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి

**ప్రజల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచండి**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**



**నంద్యాల బ్యూరో, జూన్ 19( రిపబ్లిక్ న్యూస్)** జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపడుతున్న "యోగాంధ్ర" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం యోగాంధ్ర, స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల నిర్వహణపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 21న జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న "యోగాంధ్ర" కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో గుర్తించి యాప్ లో నమోదు చేసిన అన్ని యోగా వేదికల వద్ద సమర్థవంతమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిజమైన స్ఫూర్తితో నిర్వహించాలన్నారు. మొక్కుబడి రీతిలో కేవలం లక్ష్య సాధన కోసమే కాకుండా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ప్రజల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను నిర్ణీత సమయానికి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి పౌరుల నమోదు, వేదికల నమోదు, ట్రైనర్ల మ్యాపింగ్ వంటి ప్రక్రియలు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం నమోదైన పౌరులకు యోగా శిక్షణ అందించి, శిక్షణ పొందిన వారి హాజరు వివరాలను యాప్‌లో నమోదు చేయడం అత్యంత ముఖ్యమైన అంశమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది పాల్గొనేవారు, 4,600 యోగా వేదికలు నమోదు చేయబడినట్లు వెల్లడించారు. ప్రతి వేదిక జియో ట్యాగింగ్ చేయబడిందని, ఆయా వేదికల వద్దే యోగా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమం అనంతరం హాజరు, ఫోటోలు, ఇతర వివరాలను వేగంగా అప్‌లోడ్ చేసేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను జెసి ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉన్నత విద్య, ఇంటర్మీడియట్ విద్యా శాఖల సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారి సౌలభ్యానికి అనుగుణంగా సమయాలను సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామం, సచివాలయ స్థాయిలో యోగా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

# జూన్ 21న నిర్వహించే నీట్ పునఃపరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

**జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో 1,521 మంది విద్యార్థుల హాజరు**

**నీట్ అభ్యర్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం**

**సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దు**

**మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, జూన్ 19 (రిపబ్లిక్ న్యూస్):** ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ పునఃపరీక్షను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి నీట్ పునఃపరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన నీట్ పునఃపరీక్షను జిల్లాలోని ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీఎస్సీ డిగ్రీ కళాశాల, కేవీఎస్సీ డిగ్రీ మరియు జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని ఈ ఐదు కేంద్రాల్లో మొత్తం 1,521 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో 432 మంది విద్యార్థులు, 1,089 మంది విద్యార్థినులు ఉండగా, 10 మంది దివ్యాంగ అభ్యర్థులు కూడా పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5.15 గంటలకు ముగుస్తుందని తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక సడలింపులతో సాయంత్రం 6.20 గంటల వరకు సమయం కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అడ్మిట్ కార్డు మాత్రమే తీసుకురావాలని సూచించారు. కష్టపడి సిద్ధమైన విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, స్నాక్స్, నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. నీట్ పరీక్షకు సంబంధించిన తప్పుడు ప్రచారాలు, వదంతులు సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వాటిని నమ్మవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉన్నతాధికారులను సంప్రదించాలని కోరారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే తల్లిదండ్రుల కోసం చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే విద్యార్థులు సులభంగా పరీక్షా కేంద్రాలను గుర్తించేందుకు అన్ని కేంద్రాల వద్ద దిశా నిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. జిల్లా ఎస్పీ సునీల్ షో రాణ్ మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. నిర్దేశిత గుర్తింపు పత్రాలు లేని అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలో ప్రవేశం కల్పించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రామునాయక్, అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, నంద్యాల ఏఎస్పీ మంద జావలి అల్ఫోన్స్, కలెక్టరేట్ ఏఓ సుభాకర్, డీఈఓ జనార్ధన్ రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకట రమణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, నీట్ కోఆర్డినేటర్ టి. వెంకటేశ్వర్లు, వివిధ పరీక్షా కేంద్రాల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com